
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు
5
శనివారం 11 అక్టోబరు 2025

ఆమోదం
పలు ప్రాజెక్టులు

- శ్రీశైలంలో రూ.83 కోట్లతో త్రీస్టార్ హోటల్
- మరో రెండు సోలార్ ప్రాజెక్టులకు అనుమతి
- కేబినేట్‌లో పలు అంశాలపై మంత్రుల తీర్మానం



నంద్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం అమరావతి సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు కీలక అంశాలకు ఆమోదం తెలిపారు. శ్రీశైల మల్లన్న క్షేత్రంలో త్రీస్టార్ హోటల్ ఏర్పాటు, మరో రెండు హైబ్రిడ్ సోలార్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. సుమారు ఐదువేల మందికి పైగా నిరుద్యోగులకు ఆయా ప్రాజెక్టుల్లో ఉద్యోగాలు లభించనున్నాయి.

టీటీడీ తరహాలో శ్రీశైలాన్ని..

జిల్లాలోని శ్రీశైల మల్లన్న క్షేత్రం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇది వరకే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా టీటీడీ తరహాలో శ్రీశైలాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు సైతం ప్రకటించారు. ఈ క్రమంలో తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో సైతం శ్రీశైలంలో త్వరలో రూ.83కోట్లతో త్రీస్టార్ హోటల్(హిల్టన్ గార్డెన్ ఇన్ బ్రాండ్) ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. తద్వారా సుమారు 300మందికి సదరు హోటల్ ఏర్పాటైతే ఉద్యోగావకాశం కలగనుంది. ఈ హోటల్ వెంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఏర్పాటు చేయనున్నారు. శ్రీశైలంలో త్రీస్టార్ హోటల్ ఏర్పాటైతే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మల్లన్న భక్తులకు ఎంతో ఆకర్షణీయంగా ఉండనుంది. హోటల్ ఏర్పాటుకు ఇదివరకే వందల ఎకరాలు అధికార యంత్రాంగం పరిశీలించారు.

మిద్దూరులో 1011.44 ఎకరాలు..

నందికొట్కూరు నియోజకవర్గం మిద్దూరు మండలం నాగలూటి గ్రామంలో 800 మెగా వాట్స్ సోలార్ ప్రాజెక్టు గ్రీన్‌కో సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో సదరు సంస్థకు సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం 1011.44 ఎకరాలు భూమిని కేటాయించింది. గత టీడీపీ హయాంలో 2016 ఫిబ్రవరి 25న ప్రకటించిన ప్రకారం.. 2024 మార్చి 15న అధికారులు పునఃపరిశీలన చేసి సవరణ నివేదికను అందజేసినట్లు తెలిసింది. సదరు సోలార్ ప్రాజెక్టు పూర్తైయితే జిల్లాలో సుమారు 3 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించనున్నాయి.



త్వరలో సోలార్ అండ్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు

ఉమ్మడి జిల్లాలో అనువైన ప్రాంతంలో త్వరలో 349.50 మెగావాట్ల సోలార్ అండ్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు తాజాగా కేబినెట్ ఆమోదం తెలిపింది. సదరు ప్రాజెక్టును ఆంపియన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేసేలా కేబినేట్‌లో ఆమోదం చేశారు. ఇందులో 1.80 మెగావాట్ల పవన విద్యుత్, 0.50 మెగావాట్ల ఏసీ సోలార్ ఉత్పత్తి చేయనున్నారు. మొత్తంగా 349.50 మెగావాట్ల ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. సదరు ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి నుంచి వచ్చే ఆదాయంతో ప్రభుత్వానికి 25ఏళ్లకు గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కింద 0.72 కోట్లు, ఎకరానికి రూ.50వేలు చొప్పున ఆయా స్థానిక ప్రాంతాల అభివృద్ధి కోసం వసూలు చేయనున్నారు. సదరు ప్రాజెక్టులో సుమారు 1500 మందికి ఉద్యోగ అవకాశం కూడా లభించనుంది. ఈ లెక్కన సదరు ప్రాజెక్టు పూర్తైయితే ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు స్థానిక ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు.. నిరుద్యోగులకు ఉద్యోగావకాశం కలగనుంది.



వార్డుల పునర్విభజనకు
గ్రీన్‌సిగ్నల్

- వైసీపీకి మరోసారి బిగ్ షాక్
- నాటకీయ పరిణామాల నడుమ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వార్డుల పునర్విభజన తీర్మానాన్ని ఎట్టకేలకు మున్సిపల్ కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్ తెలిపింది. శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఈ తీర్మానాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియాతో సహా పలువురు వైసీపీ కౌన్సిలర్లు వ్యతిరేకించి డుమ్మా కొట్టారు. అయినప్పటికీ నాటకీయ పరిణామాల నడుమ ఈ తీర్మానానికి ఆమోదం దక్కింది. దీంతో వైసీపీకి మరోసారి బిగ్ షాక్ తగిలింది. 2019 జూలై 24న ఆత్మకూరు నగర పంచాయతీ కాస్త గ్రేడ్-3 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చెందింది. పట్టణంలోని 20వార్డులను 24వార్డులను మార్పు చేశారు. ఈక్రమంలోనే జనాభా పెరుగుదల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న 24వార్డులను 28వార్డులుగా మార్చాలన్న అంశం తెరపైకి వచ్చింది. ఇందుకు గత నెల 24న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. వార్డుల పునర్విభజనకు సంబంధించి ఆదేనెల 26న పేపర్ ప్రకటనతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నోటీసు బోర్డుల్లో వివరాలు మున్సిపల్ అధికారులు అందుబాటులో ఉంచి ప్రజల నుంచి అభ్యంతరాలను కోరారు. ఈనెల 7న కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసి వార్డుల పునర్విభజన అంశాన్ని ప్రవేశపెట్టారు. ఇందుకు వైసీపీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డుల విభజన అడ్డగోలుగా ఉందంటూ తమకు కనీస సమాచారం ఇవ్వకుండా ఏవిధంగా వార్డులను విభజిస్తారంటూ వార్డుల పునర్విభజన తీర్మానాన్ని వాయిదా వేశారు.

టీడీపీ నాయకులు తమదైన శైలిలో..

వాయిదా పడ్డ తీర్మానాన్ని శుక్రవారం మరోసారి అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టారు. ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు వైసీపీ కౌన్సిలర్లు హాజరు కాలేదు. దీంతో సభ ప్రారంభంలో సరైన కోరమ్ లేక కౌన్సిల్ కాస్త ఆలస్యమైనప్పటికీ టీడీపీ నాయకులు తమదైన శైలిలో వ్యూహం రచించి సమావేశం జరిగేలా 13 మంది కౌన్సిలర్లు హాజరయ్యేలా చేశారు. ఎట్టకేలకు 1.30గంటల సమయంలో సభ ప్రారంభం కావడంతో వార్డుల పునర్విభజన తీర్మానానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది.



వార్డుల పునర్విభజన తీర్మానంపై జరుగుతున్న చర్చ

నెరవేరిన కల

ఆత్మకూరుకు చెందిన ఆర్యవైశ్య సంఘం, వైసీపీ నాయకుడు పువ్వాడి భాస్కర్ సతీమణి పువ్వాడి దివ్య కల నెరివేరిందని చెప్పవచ్చు. ఆరు నెలల క్రితమే ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఛైర్మన్ పదవిని తనకు భార్యకు కట్టబెట్టేందుకు పువ్వాడి భాస్కర్ ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అయితే ఆ అవకాశం చేజారడంతో ఒక్కరోజైనా ఛైర్ పర్సన్‌గా వ్యవహరించాలన్నది వారి కల. ఈక్రమంలోనే వార్డుల పునర్విభజన తీర్మానానికి ఆసియా గైర్హాజరు కావడంతో ఆమె స్థానంలో ప్రొటెం చైర్‌పర్సన్‌గా దివ్య వ్యవహరించారు.

ప్రొటెం చైర్‌పర్సన్‌గా పువ్వాడి దివ్య

మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా గైర్హాజరు కావడంతో ఆమె స్థానంలో వైసీపీకి చెందిన వైస్ చైర్‌పర్సన్ పువ్వాడి దివ్య ప్రొటెం చైర్‌పర్సన్‌గా వ్యవహరించి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీకి అనుకూలంగా ఉండే కౌన్సిలర్లు యూనూస్, జరీనాబేగం, గౌసియా, గౌస్‌లాజం, హరిప్రసాద్‌తో పాటు ప్రస్తుతం వైసీపీ వెంటే ఉన్న 1వ వార్డు కౌన్సిలర్ నూర్జహాన్, 4వ వార్డు కౌన్సిలర్ సుగుణమ్మ, 14వార్డు కౌన్సిలర్ మహ్మద్‌హుసేన్, 17వ వార్డు కౌన్సిలర్ ప్రకాష్, 19వ వార్డు కౌన్సిలర్ ఖైరూన్‌బీ, 20వ వార్డు కౌన్సిలర్ రంగస్వామి, 21వ వార్డు కౌన్సిలర్ బోయ లక్ష్మమ్మ సభకు హాజరైనట్లు సంతకాలు చేయడం గమనార్హం.


ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం

శ్రీశైలం ట్రస్టు బోర్డులో స్వల్పమార్పులు

- ఇద్దరి పేర్ల తొలగింపు
- నూతనంగా గిల్లెల శ్రీదేవికి చోటు

నంద్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఆలయ పాలక మండలి కమిటీలో స్వల్ప మార్పులతో నూతన బోర్డును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. పాలకమండలిలో బోర్డు సభ్యుల నియామకంపై ఇటీవలి కాలంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించిన వారిలో ఇద్దరి పేర్లను తొలగిస్తూ.. ఆ స్థానంలో మరో ఇద్దరికి అవకాశం కల్పించింది. బోర్డు ఛైర్మన్‌తో పాటు 17 మందితో కూడిన కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. ఇదిలా ఉండగా కమిటీ సభ్యురాలిగా నంద్యాలకు చెందిన డాక్టర్ సింధుశ్రీ, ప్రత్యేక ఆహ్వానితుడిగా డోన్‌కు చెందిన బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డిని మొదట పాలకమండలిలోకి తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే తుది జాబితాలో మాత్రం ఆ ఇద్దరి పేర్లను తొలగించింది. వారి స్థానంలో నంద్యాలకు చెందిన గిల్లెల శ్రీదేవిని కమిటీలోకి తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవం


ప్రత్యేక అలంకరణలో ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారు

ఆళ్లగడ్డ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్రోత్సవాలలో నాలుగో రోజు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీలక్ష్మీనరసింహస్వామి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను హోమ మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ పర్యవేక్షణలో తమిళనాడు నుంచి వచ్చిన ప్రత్యేక అర్చక బృందం వేద ప్రబంధ పారాయణాలు చేశారు. అనంతరం ప్రహ్లాద వరద స్వామికి అమ్మవార్లకు మంగళహారతి అందించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిపై కొలువు దీర్చి తిరువీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భ్రమరాంబ అతిథి గృహం పరిశీలన

శ్రీశైలం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న ప్రధాని మోదీ శ్రీశైలం రానున్న నేపథ్యంలో శుక్రవారం భ్రమరాంబ అతిథి గృహాన్ని జేసీ విష్ణుచరణ్ పరిశీలించారు. వసతి సదుపాయాలు, గదుల శుభ్రత, ఆహార వసతులు తదితరు అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అతిథిగృహం ప్రాంగణంలో పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది డ్యూటీలు, వంటి అంశాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశిష్ట అతిథులకు సౌకర్యవంతంగా ఉండేలా విద్యుత్, నీటి సరఫరా, భద్రతపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. జేసీ వెంట ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, ఈఈ రామకృష్ణ ఉన్నారు.

నిలకడగా శ్రీశైలం నీటిమట్టం


నిలకడగా డ్యాం

శ్రీశైలం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం నీటిమట్టం నిలకడగా ఉంది. వరద ప్రవాహం తగ్గింది. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 62,535 క్యూసెక్కులు విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి 884 అడుగులుగా ఉంది. నీటినిల్వ సామర్థ్యం 215 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి, సుంకేసుల, హంద్రీ మొత్తం 62,341 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి.

కళాశాల అభివృద్ధికి కృషి
విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా


డిగ్రీ కళాశాలను సందర్శించిన విద్యాశాఖ డైరెక్టర్

శ్రీశైలం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన ఆ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల మౌళిక వసతులపై, అధ్యాపకులు, విద్యార్థులతో ఆయన చర్చించారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. కళాశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జేసీ విష్ణుచరణ్, తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పద్మ, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

శిరివెళ్ల ఎస్సీ కాలనీలోని స్పెషల్ మోడల్ ప్రైమరీ స్కూల్



తరగతి గదులు దుర్భరం

- పెచ్చులూడి.. కూలేందుకు సిద్ధం
- బిక్కుబిక్కుమంటూ సాగుతున్న విద్యాభ్యాసం
- భయాందోళనలో విద్యార్థులు

శిరివెళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువుకుంటున్నారు. పెచ్చులూడిన తరగతి గదుల పైకప్పులు.. కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనం గోడలను చూస్తుంటే ఏ క్షణాన ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వరండాలో విద్యా బోధన

శిరివెళ్ల ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ స్పెషల్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో 63 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఐదుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల కోసం ఉన్న రెండు తరగతి గదులు పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఓ తరగతి గదిని వినియోగించడం లేదు. మరో గదిలో సైతం పైకప్పు పెచ్చులూడినప్పటికీ చేసేదేమీ లేక మూడు తరగతుల విద్యార్థులకు ఒకేచోట, మరో రెండు తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులు వరండాలో విద్యాబోధన చేస్తున్నారు. పెచ్చులూడిన పైకప్పులు, వర్షానికి పాచిపట్టి కుంగిన గోడలు ఎప్పుడు కూలుతాయో తెలియక విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు.



వరండాలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు



పెచ్చులూడిన తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

నూతన భవనాలను నిర్మించే ప్రక్రియ..

మండలంలోని గుంప్రమాన్‌దిన్నె మజారా గ్రామమైన రాజనగరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండు తరగతిగదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓ తరగతిగదిలోకి చేర్చి విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలకు నూతన భవనాలను నిర్మించే ప్రక్రియ నేటికీ ముందుకు సాగడం లేదు.





ప్రతిపాదనలు పంపించాం

శిరివెళ్ల, రాజనగరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని పూర్తిగా ధ్వంసం చేసి కొత్త భవనాలను నిర్మించాలని సర్వశిక్షా అభియాన్‌కు ప్రతిపాదనలు పంపించాం. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం.

● డీటీ శంకర్ ప్రసాద్, డిప్యూటీ డీఈవో





నివేదిక రూపొందిస్తున్నాం

శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల తరగతిగదులను పరిశీలించాం. నూతన భవనాలను నిర్మించాలని నివేదిక రూపొందించి విద్యాశాఖ ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్‌కు నివేదికలు అందజేస్తాం.

● శివ మల్లేశ్వరప్ప, ఎంపీడీవో, శిరివెళ్ల



శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్న పాఠశాల తరగతి గదులు

భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మనిషి ఆలోచనల, భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోగలిగితే మానసికంగా దృఢంగా ఉంటారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలో సైకియాట్రి విభాగం హెచ్‌వోడీ డా.నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం బాగునప్పుడే వారిని ఆరోగ్యవంతంగా ఉంటారని, వ్యక్తులు తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు స్నేహితులు దగ్గర, బంధువులు వారికి గుర్తించి వారికి కలుపుకుని వెళితే ఆ సమస్య లో నుంచి బయటపడుతారన్నారు. పౌరులకు ఎవరికైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు లీగల్ సహాయం కొరకు టోల్ ఫ్రి.నెంబర్.15100ను సంప్రదించాలని కోరారు. సైక్రియాటి విభాగాధిపతి డా.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎవరికైనా మానసిక ఆరోగ్య సమస్యలకు తమ విభాగం నుంచి 24 గంటలు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ఎవరికైనా మానసికంగా అపత్కర పరిస్థితి ఏర్పడితే సేవల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14416ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎండో క్రైనాలజీ హెచ్‌వోడీ డా.పి.శ్రీనివాసులు, లీగల్ సర్వీస్ యూనిట్ మెంబర్ డా.రాయపాటి శ్రీనివాసులు, సైక్రియాట్రి విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.గంగాధర్ నాయక్, డా.యతిరాజ్, ఎస్ఆర్‌లు డా.ఉమ్మైద్ సిరాజ్, డా.జయశ్రీ, పీజీలు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో...

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంను నిర్లక్ష్యం చేస్తే సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ఆరోగ్యకరమైన మనస్సు ఆరోగ్యమైన సమాజానికి మూలమన్నారు. మానసిక ఆరోగ్య సేవలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎల్.భాస్కర్ ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ డా.మహేశ్వర ప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ అధికారి డా.రఘు, మానసిక వైద్యులు డా.చైతన్య పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న శ్రీశైల పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి, అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేయాలన్నారు. సున్నిపెంటలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

మోదీ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

● ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్‌శాఖ

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనకు సంబంధించి విస్తృతమైన ఏర్పాట్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులను నియమించింది. పారిశుధ్యం, వీధిలైట్లు, సుందరీకరణ బాధ్యతలను సీడీఎంఏ సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర ఎండీ అనిల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ టి.గాయత్రి, పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ ప్రభాకర్, ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ ఎంకేవీ శ్రీనివాసులకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పారిశుధ్యం, వీధిలైట్లు, సుందరీకరణ బాధ్యతలు నిర్వర్తించేందుకు 18 మున్సిపాలిటీల కమిషనర్లు, 800 మంది శానిటేషన్ సిబ్బంది, 80 మంది సూపర్‌వైజర్లతో పాటు సంబంధిత యంత్రాలు, పరికరాలతో ఈ నెల 14 లోపు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు రిపోర్టు చేసుకోవాలని మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

యాగంటి హుండీ ఆదాయం రూ.20.46 లక్షలు



యాగంటి ఆలయ హుండీని లెక్కిస్తున్న భక్తులు

బనగానపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఆలయ హుండీలను 90 రోజులకు గాను హుండీని లెక్కించగా నగదు రూ.20లక్షల 46వేలు లభించినట్లు ఏసీ తెలిపారు. 650 గ్రాముల వెండి లభించినట్లు వెల్లడించారు. ఆలయ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి, సమక్షంలో బండి మౌళీశ్వరరెడ్డి, రామశేఖర్, భరతుడు, ఆలయ అర్చకులు సత్యనారాయణ, సిబ్బంది, ప్రసాద్ శ్రీరామసేవాసమితి, శ్రీబాలాజీ సేవా సమితి సభ్యులు హుండీని లెక్కించినట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మొదటి విడత కౌన్సెలింగ్

● 18న పారా మెడికల్ కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అలైడ్ హెల్త్ సైన్సెస్ పారా మెడికల్‌కు సంబంధించిన 10 డిప్లొమా కోర్సులకు మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తి చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. మెరిట్ 50 రోస్టర్ ప్రకారం సీట్లు భర్తీ చేసినట్లు తెలిపారు. 18వ తేదీ రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, పెథాలజీ హెచ్‌వోడీ డా.బాలేశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశ్వరి, ఆఫీసు సూపరింటెండెంట్ హరిశంకర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో నంద్యాల వాసి ప్రతిభ



పతకాలు సాధించిన ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో నంద్యాలవాసి కాశీపురం ప్రభాకర్‌రెడ్డి నాలుగు పతకాలు సాధించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తరఫున 50+ కేటగిరీలో ప్రాతినిధ్యం వహించన ప్రభాకర్‌రెడ్డి 25 మీటర్లు, 50 మీటర్లు ఫ్రీ స్టైల్ ఈవెంట్స్‌లో రెండో స్థానంలో నిలిచారు. ప్రభాకర్‌రెడ్డి తాను పాల్గొన్న నాలుగు ఈ వెంట్స్‌లోను పతకాలు సాధించడం విశేషం. నంద్యాలలో ప్రొఫెషనల్ స్విమ్మింగ్ పూల్ లేనప్పటికీ కేసీ కెనాల్‌లో రెగ్యులర్‌గా ప్రాక్టిస్ చేసి ఈ ఘనత సాధించడం మరో విశేషం.

5కే మారథాన్‌లో రెండో స్థానం

● రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన లీలా ప్రసాద్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడలో రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్ట్ మారథాన్ 5 కిలోమీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్ లీలా ప్రసాద్ రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి కైవసం చేసుకున్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డా.సుచిత్ర, జాయింట్ డైరెక్టర్ డా.మంజుల చేతుల మీదుగా శుక్రవారం లీలాప్రసాద్‌కు రూ.25వేల నగదు, ప్రశంసాపత్రం, మెమెంటోను అందజేశారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు అవార్డు రావడంపై డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ, జిల్లా టీబీ ఆఫీసర్ డా.ఎల్.భాస్కర్, ప్రోగ్రాం ఆఫీసర్ అలిహైదర్ అభినందనలు తెలిపారు.

మోదీ సభ ఏర్పాట్ల పరిశీలన

● పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ పరిశీలించింది. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని రాగమయూరి వద్ద పార్కింగ్, హెలి ప్యాడ్, సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించి జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, వసతులు ఏర్పాటు దిశగా అధికారులతో మా సహకారం ఎక్కడైనా అవసరం ఉంటే కోరాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అధికారులను అక్కడ పర్యవేక్షణకు నియమించాయి. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్‌బాబు, బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్‌విష్ణువర్ధన్‌రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వైకుంఠం జ్యోతి, రాఘవేంద్రరెడ్డి, మీడియా కో-ఆర్డినేటర్ బి.వెంకటరాముడు, సత్రం రామృష్ణుడు, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కురువ రామక్రిష్ణ పాల్గొన్నారు.



మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సమన్వయ కమిటీ

ప్రధాని సభకు అన్ని ఏర్పాట్లు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

ఓర్వకల్లు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన జరిగే ప్రధానమంత్రి బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సిరి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ముందుగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి శ్రీశైలం వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారన్నారు. నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఉన్న రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈసభ 40 ఎకరాల్లో 3 లక్షల మంది సమావేశంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశామన్నారు. 347 ఎకరాల్లో 10వేల బస్సులు నిలుపుకునే విధంగా 12 పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామని వివరించారు. అన్ని పార్కింగ్ పాయింట్లు జాతీయ రహదారికి అనుసంధానం చేసే విదంగా అంతర్గత రహదారుల నిర్మాణం రేపు సాయంత్రానికి పూర్తవుతుందని తెలిపారు. ఈసభకు వచ్చే ప్రజలందరికీ తాగునీరు, మజ్జిగ, భోజనం, అవసరమైన వైద్య సదుపాయాలు, టాయిలెట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

కర్నూలు క్రైం: ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పీఎం ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్, కలెక్టర్ సిరి, ఐఏఎస్ ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని పర్యటన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా జేసీ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులు

ప్రకృతి సోయగం.. అహోబిలం

ప్రహ్లాద వరదుని ఆలయంపై దూకుతున్నట్లున్న జలపాతాలు







ఎత్తైన కొండలు.. ఎటుచూసినా పరిఢవిల్లుతున్న పచ్చదనం.. నీటి గలగలలు.. కొండల నుంచి జాలువారుతున్న జల సవ్వడులు.. ప్రతి ఒక్కరినీ తన్మయత్వానికి గురిచేసే ప్రాంతమే ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం. లక్ష్మీనరసింహస్వామి రక్తసిక్తమైన చేతులు కడగడం కోసం దివి నుంచి భువికి దిగి వచ్చిన భవనాశి నది సోయగం వర్ణణాతీతం. కొండల నుంచి జాలువారుతున్న నది అందాలను చూసి మంత్ర ముగ్ధులు కావాల్సిందే. కొన్ని నెలలుగా ఎండిన జలపాతాలు ఒక్కసారిగా జలకళను సంతరించుకున్నాయి. ఈ రమణీయతను చేసేందుకు పర్యాటకులు అధికంగా తరలివస్తున్నారు.

● ఆళ్లగడ్డ, ఆంధ్రజ్యోతి



అడవి తల్లి ఒడి నుంచి పారుతున్న భవనాశి నది



ఉదయం పూట రెండు కొండల మధ్య స్వామి ఆలయం

లెక్క తేలని ఆభరణాలు

- 11 ఏళ్లుగా లెక్కలు చూపించని ఈవోలు
- విచారణకు ఆదేశించిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు
- రేపు ఆభరణాల, రికార్డుల తనిఖీలు



నందవరం చౌడేశ్వరీమాత ఆలయం

బనగానపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయానికి సంబంధించిన బంగారు బంగారు, వెండి ఆభరణాల లెక్క తేలలేదు. ఆలయ ఈవోలు 11 ఏళ్లుగా లెక్కలు చూపించలేదు. అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయా లేదా అన్న మీమాంసలో భక్తులు పడ్డారు. ఈవోలు మారినప్పుడల్లా కొత్తగా వచ్చిన ఈవోలకు నగదు లావాదేవీలతో పాటు బంగారు, వెండి ఆభరణాల రికార్డులు చూపించాలన్న నిబంధన ఉంది. గతంలో పనిచేసిన ఈవోలు లెక్కలు చూపకపోవడంతో దేవదాయశాఖ ఉన్నతాధికారులు విచారణ జరపాలని, గతంలో పనిచేసిన ఈవోలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు.

హుండీని లెక్కించి..

నందవరంచౌడేశ్వరీమాత ఆలయానికి లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. వారు మొక్కులు చెల్లించడానికి కానుకలు హుండీల్లో వేస్తుంటారు. కొందరు అమ్మవారికి బంగారు, వెండి ఆభరణాలను కొందరు నగదును సమర్పిస్తుంటారు. అమ్మవారి హుండీ నగదును, బంగారు, వెండి ఇతర ఆభరణాలను ప్రతి ఏడాది రెండు మూడుసార్లు లెక్కిస్తారు. వీటిలో నగదు బ్యాంకుల్లో జమచేస్తారు. బంగారు, వెండి, ఇతర ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్ర పరుస్తారు. కొంత బంగారును అమ్మవారికి అలంకరణకు గాను ఆలయ అధికారులు, ఆలయ పూజారుల కస్టడీలో భద్ర పరుస్తారు. హుండీలను ఆలయ ఈవోలు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు, ఉన్నతాధికారులు, భక్తుల పర్యవేక్షణతో లెక్కిస్తారు. భక్తులు సమర్పించిన కానుకలు ఇతరత్రా వచ్చే ఆదాయంలోనే ఆలయ సిబ్బందికి, పూజారులకు, ప్రసాదాలకు, అభివృద్ధికి, నిర్వహణకు ఖర్చు చేస్తుంటారు.

ప్రస్తుత ఈవో ఫిర్యాదుతో..

చౌడేశ్వరీమాత అమ్మవారికి సమర్పించిన బంగారు ఆభరణాలను, ఆభరణాల వివరాలను, రికార్డులను గతంలో పనిచేసిన ఈవో నూతనంగా వచ్చిన ఈవో నల్లకాల్వ శ్రీనివాసులురెడ్డికి అప్పగించలేదు. దీంతో ఆయన దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఈవిషయమై ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు నందవరం ఆలయ ఆభరణాల వివరాలు తేల్చాలని జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పాండురంగారెడ్డికి ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు పాండురంగారెడ్డి గతంలో పనిచేసిన ఈవోలు రామానుజన్, కామేశ్వరికి నోటీసులు జారీచేశారు. ఈనెల 12న నందవరం శ్రీచౌడేశ్వరీ ఆలయంలో బంగారు, వెండి ఆభరణాలకు సంబంధించి వెరిఫికేషన్, రికార్డులను తనిఖీ చేయనున్నారు.

బంగారు ఆభరణం మాయం?



చౌడేశ్వరీ అమ్మవారు ధరించే ఓ బంగారు ఆభరణం మాయమైనట్లు ఆరోపణలున్నాయి. ఈ ఆభరణం ఎక్కడ మాయమైందో తేల్చే పనిలో దేవదాయశాఖ అధికారులు విచారణ సాగిస్తున్నారు. గతంలో ఓ భక్తురాలు ఈఆభరణాన్ని అమ్మవారికి సమర్పించినట్లు తెలుస్తోంది. ఆబంగారు ఆభరణం హుండీ లెక్కింపుల్లోనూ, అమ్మవారి మెడలోనూ లేక పోవడం, గతంలో పనిచేసిన ఈవోలు ఆభరణాల వివరాలు లెక్క చూపకపోవడంతో ఆ భక్తురాలు జిల్లా దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. తాను సమర్పించిన ఆభరణం కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో ఈ విషయమై లోతైన విచారణ జరపాలని దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఈ విషయం నిగ్గు తేల్చేందుకు ఈనెల 12న విచారణకు రావాలని ఈవోలు రామానుజన్, కామేశ్వరికి ఆభరణాల తనిఖీ అధికారి పాండురంగారెడ్డి నోటీసులు జారీ చేశారు.

పార్క్‌కు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- అతివేగంతో బైక్‌ను ఢీకొట్టిన లారీ
- భర్త దుర్మరణం.. భార్య, కొడుకుకు తీవ్రగాయాలు



తిరుపాల్ (ఫైల్)

ఆదోని రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్క్‌కు వెళ్లి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య, కొడుకు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘటన ఆదోని పట్టణంలో చోటు చేసుకున్నట్లు తాలుకా ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని బీవీఆర్ ఎస్టేట్‌లో తిరుపాల్(45), భార్య సుమలత, కూతురు ప్రజ్వల, కొడుకు విక్రాంత్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన కౌతాళం ఎల్లెల్సీ సెక్షారులో లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్నాడు. కొడుకు విక్రాంత్ మారం చేయడంతో కొడుకు, భార్య సుమలతతో కలిసి బైక్‌పై ఆరేకల్లు శివారులోని పార్క్‌కు వెళ్లారు. అక్కడ కాసేపు సరదాగా గడిపారు. చీకటి పడుతున్న తరుణంలో తిరుగు ప్రయాణమయ్యారు. ఆరేకల్లు గురుకల పాఠశాల వద్దకు రాగానే వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తిరుపాల్‌పై లారీ ఎక్కడంతో శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాల పాలైన సుమలత, విక్రాంత్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి స్వల్పగాయాలు

బేతంచెర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్లగుట్టలో ట్రాక్టర్, మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన నరేంద్రనాథ్ రెడ్డి (34) అక్కడికక్కడే మృతి చెందగా.. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలివీ.. శుక్రవారం సాయంత్రం గోర్లగుట్ట గ్రామానికి చెందిన నారాయణరెడ్డి సుభద్రమ్మ దంపతుల కుమారుడు నరేంద్రనాథ్ రెడ్డి తన ఇంటి వద్ద నుంచి పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా నాపరాయి లోడుతో బేతంచెర్లకు వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడే మృతి చెందాడు. అతడితో పాటు మోటారు సైకిల్‌పై ఉన్న సుబ్బ అనే యవకుడితో పాటు రోడ్డు పక్కన నడుచుకుంటున్న వెళ్తున్న రజనీ అనే బాలికకు గాయాలయ్యాయి. ఇద్దరినీ బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అబ్దుల్ నబీ తెలిపారు.

చికిత్స పొందుతూ..

వెల్దుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకైన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇవీ.. మండలంలోని ఎస్.బోయినపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగి ఒకే కుటుంబానికి చెందిన బండ నాగరాజు, సువర్ణ, అనిల్, చరణ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నలుగురు కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బండ నాగరాజు శుక్రవారం చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మిగతా ముగ్గురి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం.

శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



బాధితురాలికి న్యాయపత్రాలు అందిస్తున్న వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం చేకూరుతుందని చైర్మన్ ఎం.వెంకట హరినాథ్ తెలిపారు. శుక్రవారం శాశ్వత లోక్ అదాలత్‌లో వివాదానికి సంబంధించి ఖర్చు లేకుండా సత్వర న్యాయం చేశామన్నారు. ఫిర్యాది ఎస్.వెంకటలక్ష్మి భర్త అతను బతికి ఉన్నప్పుడు నగరానికి చెందిన ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ నుంచి రూ.6లక్షలు రుణం తీసుకున్నాడు. ఆయన మృతి చెందాక ఫిర్యాది బాకీ మొత్తాన్ని చెల్లించినా కూడా టైటిల్ డీడ్లను కంపెనీవారు తిరిగి ఇవ్వలేదు. దీంతో ఫిర్యాది శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించగా, రాజీమార్గంలో పరిష్కరించి టైటిల్ డీడ్‌ను అందజేశారు. సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజుబాబు, న్యాయవాది రాంపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయుడి తప్పేంటి?

- విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపడమా?
- గురువుపై విద్యార్థి తండ్రి దాడి
- తల, ముక్కుకు గాయాలు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు



గాయపడ్డ ఉపాధ్యాయుడు బసవరాజు

గోనెగండ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆ ఉపాధ్యాయుడు చేసిన తప్పేంటి? విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయడమా.. ప్రత్యేక శ్రద్ధ చూపి చదువు చెప్పడమా.. విద్యార్థి పాఠశాలకు రాకపోతే పిల్లలను వారింటికి పంపి వాకబు చేయడమా? ఇదేనా అతను చేసిన తప్పు. దీనికి ప్రతిఫలమేనా కర్రతో దాడి. గురువు అని కూడా చూడకుండా విద్యార్థి తండ్రి కర్రతో దాడి చేసిన ఘటన మండలంలోని గాజులదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, విద్యా శాఖాధికారులు తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన బసవరాజు ఎనిమిదేళ్లుగా గాజులదిన్నె ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అదే కాలనీకి చెందిన మీసాల రంగస్వామి కుమారుడు హర్షవర్ధన్ మానసిక దివ్యాంగుడు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతు న్నాడు. బసవరాజు ఆవిద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యా బోధన చేసేవాడు. కొన్ని రోజులుగా హర్షవర్ధన్ పాఠశాలకు రావడంలేదు. దీంతో ఉపాధ్యాయుడు పాఠశాలకు చెందిన ఇతర పిల్లలను హర్షవర్ధన్ ఇంటికి పంపాడు. దీంతో విద్యార్థి తండ్రి ఆగ్రహంతో ఊగిపోయాడు. శుక్రవారం బసవరాజు పాఠశాలకు వస్తుండగా మీసాల రంగస్వామి కర్రతో దాడి చేశాడు. దీంతో తలకు, ముక్కుకు గాయాలయ్యాయి. ఘటనను గమనించిన కాలనీవాసులు దాడిని అడ్డుకున్నారు. తోటి ఉపాధ్యాయులు, కాలనీవాసులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభు త్వాస్పత్రికి తరలించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఈవో రామాంజినేయులు, నీలకంఠ, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ విజయభాస్కర్ విచారణ చేసి మీసాల రంగస్వామిపై దాడి కేసు నమోదు చేశారు.

బదిలీ అయిన చివరి రోజే దాడి..

గాజులదిన్నెలో ఎనిమిదేళ్లుగా పనిచేయడంతో బసవారాజును లాంగ్ స్టాండింగ్ కింద కోడుమూరుకు బదిలీ అయ్యాడు. గాజులదిన్నెలో శుక్రవారం చివరి రోజు విధులు నిర్వహించేందుకు రాగా దాడి జరిగింది. సోమవారం కోడుమూరులో జాయిన్ కావాల్సి ఉంది.

బట్టమేక పక్షి తిరిగి వచ్చేలా ఏర్పాటు చేద్దాం

- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బట్టమేక పక్షి తిరిగి రోళ్లపాడు అభయారణ్యంలోకి వచ్చేలా ఏర్పాటు చేద్దాం అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం మిడుతూరు మండలంబ రోళ్లపాడు అభయారణ్యం గెస్టుహౌస్ ఆవరణంలో సొసైటీ బస్టర్డు రికవరీ ప్రోగ్రామ్ అనే కార్యక్రమం వ్యవస్థాపకుడు మాండ్ర లింగా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాండ్ర లింగారెడ్డి మాట్లాడుతూ రోళ్లపాడు అరణ్యంలో కనుమరుగైన బట్టమేక పక్షిని తిరిగి రప్పించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొంది స్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పక్షికి ఇక్కడ అనుకూలమైన గడ్డి మైదానం ఉండడం వల్ల 1986లో రోళ్లపాడు అభయారణ్యంలో బట్టమేక సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బట్టమేక పక్షులు రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో 150 మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు ఇక్కడికి వచ్చి పోతున్నాయన్నారు. ప్రస్తుతం వాతావరణ కాలుష్యం, సోలార్, హైటెన్షన్ విద్యుత్ వైర్లు తదితర కారణాల వల్ల బట్టమేక పక్షులు ఇక్కడికి రావడం లేదన్నారు. కావున బట్టమేక పక్షులు మళ్లీ ఇక్కడికి వచ్చే విధంగా బస్టర్డు రికవరీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసినట్లు మాండ్ర లింగారెడ్డి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ రోళ్లపాడు అభయారణ్యంలో బట్టమేక పక్షి సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం మన అదృష్టమన్నారు. ప్రపంచంలోనే పేరుగాంచిన ఈ పక్షిని కాపాడు కోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి రోళ్లపాడు అభయ అరణ్యాను అభివృద్ధి చేద్దామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ బట్టమేక పక్షికి ప్రసిద్ధిగాంచిన ప్రదేశం రోళ్లపాడు కావడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాంబే బర్డు సైటిస్టు డాక్టర్ సుజిత్ నర్వాడే, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద రెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కడియం వెంకటేశ్వర్లు యాదవ్, రామస్వామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, వెంకటరామి రెడ్డి రవీంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డా.ఎన్‌టీఆర్ వైద్య సేవల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కో ఆర్డినేటర్ డా.రూపేంద్రనాథరెడ్డి తెలిపారు. జిల్లాలో 25 ఆస్పత్రులలో డా.ఎన్‌టీఆర్ వైద్యసేవలు ఉన్నాయని, ప్రస్తుతం ఆ ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేశారన్నారు. కాగా జిల్లాలో ఆళ్లగడ్డలో ఉన్న స్వాంతన ఆస్పత్రి, నంద్యాలలో శాంతిరాం ఆస్పత్రి, మధు చిన్న పిల్లల ఆస్పత్రుల్లో డా.ఎన్‌టీఆర్ వైద్యసేవలు కొనసాగిస్తున్నారన్నారు. మిగతా ఆస్పత్రుల్లో వైద్యసేవలు లేకపోవడంతో 104వాహనాలను అందుబాటులో ఉంచి రోగుల కోరికమేరకు జీజీహెచ్, శాంతిరాం ఆస్పత్రులకు తరలిస్తున్నామన్నారు. నంద్యాలలో 19, ఆత్మకూరులో 2, డోన్‌లో 3, ఆళ్లగడ్డలో 1ఆస్పత్రుల్లో డా.ఎన్‌టీఆర్ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. డోన్ ప్రాంత రోగులకు అందుబాటులో 104వాహనం ఏర్పాటు చేశామన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాణ్యం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొగర్చేడు గ్రామం కుందూ వంతెన వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని మగ మృతదేహాన్ని గుర్తించినట్లు పాణ్యం ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మృతునికి 35 నుంచి 45 యేళ్ల వయసు ఉంటుందన్నారు. కుందూ నీటిలో మూడు రోజుల క్రితం పడి మరణించి ఉండవచ్చని పేర్కొన్నారు.. మృతదేహం ఎత్తు 5. 5 అడుగులు ఉందన్నారు. శరీరంపై నీలం రంగు ఆఫ్ షర్ట్, తెల్లని కట్ బనియన్, దానిపై లక్స్ అని ఎర్ర అక్షరములు, దానికింద వీనస్ అన్న నీలం రంగు అక్షరాలు ఉన్నాయన్నారు. నలుపు రంగు ప్యాంటు, నీలం రంగు కట్ డ్రాయర్, దానిపై నవీన్ అన్న అక్షరాలు ఉన్నాయన్నారు. సమాచారం తెలిసిన వారు పాణ్యం ఎస్‌ఐ నెంబరు 9121101096 కు అందజేయాలని కోరారు.

అనుమతుల్లేని బాణసంచా పట్టివేత



బాణసంచా చూపుతున్న సీఐ

నంద్యాల టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిత్తలూరివారి వీధిలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు శుక్రవారం పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. అనుమతుల్లేకుండా నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు దాడులు చేసి సుమారుగా రూ.30 వేలు విలు చేసే వస్తువులను పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దుకాణాన్ని కృష్ణమోహన్‌అనే వ్యక్తి నడుతున్నట్లు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అదే విధంగా రానున్న దీపావళికి అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు ఉంచరాదన్నారు.

చిట్టీల వ్యాపారిపై కేసు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూకృష్ణానగర్ చెందిన చిట్టీల వ్యాపారి కృష్ణకుమార్ అనే వ్యక్తి మోసం చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కృష్ణకుమార్ చిట్టీల వ్యాపారం నిర్వహిస్తుంటున్నారు. ఇదే కృష్ణానగర్‌కు చెందిన నిరంజన్ కుమార్ రూ.42 లక్షల మేర చిట్టీల కంతులు చెల్లించారు. దీంతో పాటు మరో కొంత నగదును కృష్ణకుమార్ అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న మొత్తం తిరిగి చెల్లించకపోగా, చిట్టీ కంతులు తిరిగి వెనక్కు ఇవ్వకపోవడంతో పలుసార్లు నిలదీశాడు. కొద్ది కాలంగా తప్పించుకుని తిరుగుతుండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీకి పునాదులు కార్యకర్తలే

- రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- వైసీపీ నంద్యాల జిల్లా స్థాయి సమావేశం



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నంద్యాల రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీకి బలమైన పునాదులు కార్యకర్తలేనని వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల లోని ఆర్‌కే ఫంక్షన్ హాల్లో జిల్లా స్థాయి సంస్థాగత సమావేశం జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు జిల్లాలోని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, పార్లమెంట్ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి పాల్గొన్నారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు వివిధ విభాగాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కమిటీల ఏర్పాటుతో కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందన్నారు. నవంబరు 24 నుంచి రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కోటి సంతకాల సేకరణ చేసి గవర్నకు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి, నాయకులు చల్లా మధుసూన్‌రెడ్డి, భూమా కిషోర్‌రెడ్డి, పెద్ద ఎత్తున కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.5

పత్తికొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టమోటా కిలో రూ.5కు పడిపోయింది. 10 కిలోల జత గంపలు వ్యాపారులు రూ.100 నుంచి రూ.150 వరకు కొనుగోలు చేశారు. అయితే ఉన్నతాధికారులు మార్కెట్‌కు వచ్చిన సమయంలో ధరలు ఎక్కువగా పలుకుతున్నాయని వారు వెళ్లిపోగానే ధరలను తగ్గించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నాణ్యతను బట్టి టమోటా కొనుగోళ్లు జరుగుతున్నాయని మార్కెట్ యార్డు ప్రత్యేక కార్యదర్శి పద్మావతి తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు మొత్తం 60.81 టన్నుల టమోటా వచ్చింది. కనిష్ఠంగా క్వింటా రూ.500, సగటున రూ.1,200, గరిష్ఠంగా రూ.1,700 చొప్పున కొనుగోళ్లు జరిగాయి.



పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా

పత్తి కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

- ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని జేసీ నవ్య ఆదేశం



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పత్తి పంట సాగులో మొదటి స్థానంలో ఉన్న కర్నూలు జిల్లా రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలతో జేసీ డా.నవ్య శుక్రవారం మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ అధికారులతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సీసీఐ అధికారులు వెంటనే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరపాలని, ఈ విషయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ అధికారులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని కొనసాగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్‌లో సాగైన పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లాలో అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జేసీ ఆదేశించారు. ప్రభుత్వం క్వింటం పత్తికి మద్దతు ధరను రూ.8,060గా నిర్ణయించిందని, నాణ్యతను బట్టి ప్రతి క్వింటానికి ఈ ధర రైతుకు అందించాలని స్పష్టం చేశారు. పొడవు రకం పత్తికి ఈ ధర అందించాలన్నారు. పత్తిని విక్రయించే రైతులు ఆదోని మార్కెట్ కమిటీ 9182361164, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ 9182361166, మంత్రాలయం మార్కెట్ కమిటీ 8328682823, కోడుమూరు 9705556596 నెంబర్లను సంప్రదించి సమాచారాన్ని మార్కెట్ కమిటీల సెక్రటరీలు అందించే విధంగా మార్కెటింగ్ శాఖ ఏడీఎం చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పొట్టకొడుతున్న ఏజెన్సీలు

- 13న కలెక్టర్‌కు వినతి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పొట్టకొడుతున్నాయని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ప్రణీత్, జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, ఏఐటీవైసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు జీవో.నెంబర్.138 ప్రకారం కనీస వేతనం రూ.18,600లు సూపర్‌వైజర్లకు రూ.21వేలు వేతనం అమలు చేయాలని పీఎఫ్, ఈఎస్‌ఐతో పాటు వారాంతపు సెలవులు, అర్జిత సెలవులు జాతీయ పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలకు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సెక్యూరిటీ గార్డుల యూనియన్ అధ్యక్షుడు తిక్కన్న, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరాములు, విక్రమ్, జయమ్మ, బాలు పాల్గొన్నారు.

మంత్రాలయంలో మద్యం స్వాధీనం

మంత్రాలయం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం లోని రామచంద్ర నగర్ కు చెందిన ఈడిగ జయరాముడు భార్య ఈడిగ శారద అనే మహిళ అక్రమంగా తన ఇంటిలో అమ్ముతుండగా ఎస్‌ఐ శివాంజల్ దాడులుచేసి పట్టుకున్నారు. శక్రవారం రాత్రి వివిధ రకాల మద్యం 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అరెస్టుచేశారు. మంత్రాలయం పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం విక్రయించినా, సరఫరా చేసినా, బహిరంగా ప్రదేశాల్లో మద్యం సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఉపశమనం


ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి , అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగిందని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫ్రిజ్, టీవీ, డిష్‌వాషర్, ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించారు. వ్యాపారతీరును ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ 10 శాతం తగ్గిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శేషన్న, నంద్యాల జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్లు లక్ష్మీనాయక్, చందన్‌హర్ష, డీసీటీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వర రావు

నందికొట్కూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడారు. భారత దేశపు అత్యున్నత న్యాయమూర్తిపై దాడి చేయడం విచారకరమన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా వేలాది కులాలు కలిగిన భారత దేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మతోన్మాద శక్తులు పేట్రేగిపోయి ముస్లిం, క్రిస్టియన్స్‌పై దాడులు అధికమైనట్లు ఆరోపించారు. ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేక పోతే సామాన్య ప్రజలకు ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. భారత రాజ్యాంగపై ఏమాత్రం గౌరవం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, పకీర్ సాహేబ్, నాగన్న, బాబు పాల్గొన్నారు.

పరోక్ష సేవలకు అవకాశం

మహానంది , అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహానంది దేవస్థానంలో కార్తీకమాసం పురస్కరించుకొని భక్తులకు పరోక్షంగా అభిషేక సేవలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆలయ పరిధిలోని యాగశాల మండపంలో విరాళాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. కార్తీకమాసంలో భక్తులు రూ.2 వేలు చెల్లిస్తే పరోక్ష సేవకు అవకాశం కల్పిస్తామన్నారు. మాసం పూర్తి అయ్యే వరకు నిత్యం ఆలయంలో దాతల పేరున గోత్ర నామాలు, అభిషేకార్చనలు జరుగుతాయన్నారు.

గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి


భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో

కొత్తపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువుల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మేరీ సూచించారు. శుక్రవారం పల్లె పండుగలో భాగంగా మండలంలోని కొత్తపల్లి, గుమ్మడాపురం, సింగరాజునపల్లి, శివపురం గ్రామాల్లో ఏపీవో విమలమ్మ, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నా యకులు, లబ్ధిదారులతో కలిసి ఎంపీడీవో మేరీ గోకులం షెడ్ల నిర్మా ణం కోసం భూమి పూజ చేయించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలానికి 14 గోకులం షెడ్లు మంజూరు కాగా, అందులో భాగం గా కొత్తపల్లి, శివపురం, సింగరాజునపల్లె, గుమ్మడాపురం గ్రామాల్లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం వంద శాతం రాయితీతో నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ లింగస్వామి గౌడు, క్లస్టర్ ఇన్‌చార్జి నారపురెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, నాయకులు జడ్.వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, నాగేశ్వరగౌడు, అమర్‌నాథ్ యాదవ్, బొరెడ్డి రామకృష్ణారెడ్డి, లబ్ధిదారులు మౌలాలి, శివకుమార్, నక్క జయన్న, అన్వర్‌బాషా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

నంద్యాల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని అధికారులు వేగవంతం చేయాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని 9వ వార్డు బొంతలవీధిలో స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఏబీఎం చర్చి సమీపంలో రూ.32 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. నాణ్యతతో పనులు వేగంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, కృపాకర్, దేవనగర్ ఖాజా పాల్గొన్నారు.

పరిశోధనా దృక్పథంతో ముందుకు సాగాలి

- ఆర్జీఎం విద్యాసంస్థల చైర్మన్ శాంతిరాముడు



జ్యోతి వెలిగిస్తున్న శాంతిరాముడు

పాణ్యం, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): ప్రతి విద్యార్థి పరిశోధనా దృక్పథంతో ముందుకు సాగాలని ఆర్జీఎం విద్యా సం స్థల చైర్మన్ శాంతిరాముడు సూచించారు. శుక్రవారం మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో సిగ్మా సమన్వయ 2కె25 సాంకేతిక సదస్సు నిర్వహించారు. సదస్సును విద్యాసంస్థల చైర్మన్ శాంతిరాముడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. సాంకేతిక విద్యను ప్రయోగాత్మకంగా వినియోగించుకోవాలన్నారు. సాంకేతిక సదస్సులు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడతాయన్నారు. ఈ సదస్సులో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పేపర్ ప్రజంటేషన్, టెక్ క్విజ్, కోడింగ్ కాంటెస్ట్, మోడల్ ఎక్స్‌పో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 92 మంది పరిశోధనాత్మక పేపర్లు ప్రదర్శించారు. విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న స్టాల్స్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్‌వోడీలు పారూక్, రమాదేవి, డేవిడ్ సుకీర్తికుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపీ బైరెడ్డి శబరి
- పార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరణ


సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ

నంద్యాల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం పట్టణ బొమ్మలసత్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కొన్ని సమస్యలను దశల వారీగా పరిష్కారం చూపుతామని బాధితులకు హామీ ఇచ్చారు. నంద్యాల పదవీవిరమణ ఉద్యోగులకు ఎంపీ నిధుల ద్వారా సహకరిస్తామన్నారు. రైల్వే, నేషనల్ హైవే వద్దనున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆమె ఆదేశించారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి , రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్టేట్ కమిటీ మెంబరు వెంకటరంగయ్య, బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యులు విజయకుమార్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ అని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం బొమ్మలసత్రంలోని పార్టీ కార్యాలయంలో ఆళ్లగడ్డ మండలం బత్తులూరు గ్రామానికి చెందిన సజ్జల నాగశేషుకు మంజూరైన రూ 8.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంపీ అందజేశారు.

ఎస్పీని కలిసిన ఎంపీ


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ

నంద్యాల టౌన్ అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్పీ సునీల్ షెరాన్‌ను ఎంపీ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ అనంతరం జిల్లాలోని శాంతి భద్రతలపై, మోదీ పర్యటన పై చర్చించారు. జిల్లాలోని పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంట నాయకులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ నాయకులు

నంద్యాల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ప్రధాని ఇచ్చిన విభజన హామీలు అమలు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వామపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు రమేశ్‌కుమార్, రంగనాయకులు మాట్లాడుతూ.. విభజన చట్టంలోని అంశాలను నేటికీ అమలు చేయకుండా ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి రావడం సరైందికాదన్నారు. జీఎస్టీ తగ్గింపు అంటూ దేశ వ్యాప్తంగా వంద సభలు నిర్వహించారన్నారు. జీఎస్టీ ద్వారా ఇప్పటికే రూ.90 లక్షల కోట్లకు పైగా పన్నులు వసూలు చేసి నేడు రూ.48 కోట్లు తగ్గించామని ప్రగల్భాలు పలకడం దేశ ప్రజలను మోసం చేయడమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు మోదీకి భజనలు చేస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 15న టెక్కె మార్కెట్ యార్డు నుంచి గాంధీచౌక్ వరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు చౌడప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగరాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మనసు ఆరోగ్యంగా ఉండాలి : జీసీడీవో


విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

నంద్యాల నూనెపల్లి , అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మనసు ఆరోగ్యంగా ఉంటే జీవితం ఆనందంగా ఉంటుందని జీసీడీవో నాగసువార్చల అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కేజీబీవీ మైనారిటీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్య ప్రాధాన్యం, ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, ఆరోగ్యకరమైన ఆలోచనలపై జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన చిట్కాలు, సూచనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీలు, మైండ్ రిలాక్సేషన్ యాక్టివిటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ హెప్సిబా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిరాంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

పాణ్యం: మండలంలోని శాంతిరాం పార్మసీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఉత్కంఠ నిర్వహణ, మానసిక వ్యాధుల రకాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌చెట్టి, శాంతిరాం మెడికల్ కళాశాల సైకియాట్రిక్ వైద్యులు సింధూజ, కిషోర్, సుప్రియ, హెచ్‌వోడీ యుగంధర్ పాల్గొన్నారు.

క్రీడలకు సహాయ సహకారాలు అందిస్తాం

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్
- ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు ప్రారంభం


ఎస్‌జీఎఫ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్


పాణ్యం: సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శంకరప్రసాద్

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడలు ఎక్కడ జరిగినా తమవంతు సహాయసహకారాలు అందిస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడలు ఎక్కడ జరిగినా తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. అనంతరం కబడ్డీ పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఇండోర్ స్టేడియంలో షటిల్ బాడ్మింటన్ పోటీలను డీఎస్‌డీవో ఎంఎన్‌వి రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ చంద్రావతమ్మ, మండల విద్యాశాఖాధికారి శివరాంప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అసదుల్లా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, ఉర్దూ చైర్మన్ అస్మద్దీన్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, ఎస్‌పీఈ జిల్లా ప్రధానకార్యదర్శి దండెనాగరాజు, డివిజనల్ కో ఆర్డినేటర్ శివకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాణ్యం: పాణ్యం మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. నంద్యాల, డోన్ డిప్యూటీ డీఈవోలు శంకరప్రసాద్, వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, బ్యాడ్మింటన్, చెస్ తదితర క్రీడల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం రాములునాయక్, ఎంపీటీసీ రంగరమేష్, మాజీ ఉపసర్పంచ్ రమణమూర్తి, టీడీపీ, జనసేన నాయకులు రాంమోహన్‌నాయుడు, జగదీశ్, జాతీయ క్రీడాకారుడు నాగగోపేశ్వరరావు, ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, పీడీ వెంకటేశ్వరరెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల జడ్పీ పాఠశాల ఆవరణలో శుక్రవారం స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీలను హెచ్‌ఎం మధుసూదన్ ప్రారంభించారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను మండల విద్యాధికారి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను డివిజన్‌స్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు భుజంగరావు తెలిపారు.


పగిడ్యాలలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం


గడివేములలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ప్రభుత్వ ఆదాయానికి గండి

- రావాల్సింది రూ.13.16లక్షలు
- వసూలైంది రూ.4,696 మాత్రమే
- అధికారుల నిర్లక్ష్యం.. అభివృద్ధికి ఆటంకం


కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయం

కొత్తపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. మండలంలోని 12 గ్రామ పంచాయతీల నుంచి ప్రభుత్వానికి రావాల్సింది రూ.13,16,818లు. నేటికీ వసూలు చేసింది కేవలం రూ.4,697లు మాత్రమే. మండల, గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆయా గ్రామాలకు నిధులు లేక అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 12 పంచాయతీల నుంచి ఇంటి, నీటి పన్ను, కొత్త గృహాల అప్రూవల్, గ్రామ పంచాయతీల్లోని వ్యాపార సముదాయాలు, సంత మార్కెట్ ద్వారా ప్రభుత్వానికి రూ.13లక్షలు ఆదాయం రావాల్సి ఉంది.

వసూలైన నిధులతో ఆయా గ్రామాల విద్యుత్ బిల్లులు, పారిశుధ్య నిర్మూలన, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు, డ్రైనేజీ, తదితర అభివృద్ధి పనులకు ఉపయోగించాల్సి ఉంటుంది. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కేవలం వేలల్లో మాత్రమే వసూలు కావడంతో పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన నిధులు వసూలు చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో సుబ్బరావును వివరణకోరగా.. గ్రామ రాజకీయాల వల్ల పంచాయతీకి రావాల్సిన బకాయిలు వసూలు కావడం కత్తిమీద సాములా ఉందన్నారు. రానున్న మార్చిలోగా బకాయిలు వసూలు చేసేందుకు కృషి చేస్తామన్నారు.


హోమంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పునఃప్రతిష్ఠోత్సవాలు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాల్‌నగర్ వరసిద్ధి వినాయక సహిత అభయాంజనేయస్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం దీక్షాహోమాలు, విగ్రహాలకు ధాన్యాధివాసం, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఇంద్రగంటి మణికంఠ శాస్త్రి, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన

పాములపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాడి పశువుల ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలని పశు వైద్యాధికారి భాస్కర్ సూచించారు. శుక్రవారం తుమ్మలూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. తొమ్మిది ఆవులు, 47 బర్రెలు, 70 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. నట్టల నివారణ టీకాల ప్రాముఖ్యత, మిని గోకులాలు, ఉపాధిహామీ ద్వారా పశుగ్రాసం పెంపకం, కేసీసీ లోన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనమాల ప్రసాద్, డాక్టర్ రవిశంకర్, సాయిలీల, సిబ్బంది శ్వేత, కవిత, తిరుమలేశ్, ప్రసన్న, చాందిని, శ్వేత, పూజిత, గోపాలమిత్ర మున్వర్‌బాషా, భాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పగిడ్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాతకోట గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు అచ్చన్న, అబ్దుల్ కలాం, వెంకటేశ్వర్లు, బాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పగిడ్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, లక్ష్మీదేవి సూచించారు. రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పగిడ్యాల సచివాలయంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలకు చిన్నతనంలో వివాహం చేయడం వలన అనారోగ్యం బారిన పడుతారన్నారు. బాలికల పై వివక్షత చూపరాదని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు హైమావతి, వరలక్ష్మీ, సునీత, పద్మావతి, మల్లీశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ఆత్మకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శని, ఆదివారం నిర్వహిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ కోరారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతు సమస్యల పరిష్కారం కోసం చర్చించడానికి చేపట్టిన జిల్లా మహాసభలకు రైతులు, రైతు సంఘాల నాయకులు తరలిరావాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, వీరన్న తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

మహానంది , అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు సుబ్బరాయుడిని తొలగించినట్లు ఏపీవో మల్లికార్జున శుక్రవారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంటు సుబ్బరాయుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి నిజనిర్ధారణ కావడంతో విధుల నుంచి తొలగించినట్లు ఆయన చెప్పారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

గడివేముల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి పేదలకు అండగా నిలిచిందని పాణ్యం మార్కెట్‌యార్డ్ చైర్మన్ అంగజాల గీత అన్నారు. శుక్రవారం మండలంలోని దుర్వేసి గ్రామంలో టీడీపీ పాణ్యం నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్‌తో కలిసి జీఎస్టీ తగ్గింపు ఆమె అవగాహన కల్పించారు. ప్రతి రూపాయి ఆదాయాన్ని ప్రజల అవసరాలకు వినియోగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గడిగరేవుల నీటి సంఘం చైర్మన్ శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు వీరయ్యకు అవార్డు


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అపుస్మా సంఘం సభ్యులు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పట్టణంలోని గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయుడు, కో ఆర్డినేటర్ వీరయ్య అందుకున్నారు. శుక్రవారం నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, అపుస్మా చైర్మన్, ఎంఎల్‌సీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అపుస్మా నంద్యాల జిల్లా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి అధ్యక్షతన వహించారు. విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తున్న ఉపాధ్యాయుడు వీరయ్యను పాఠశాల యాజమాన్యం డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించింది.

స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ


ఊయలసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం శ్రీశైలం దేవస్థానం శుక్రవారం సాయంత్రం స్వామి,అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ముందుగా అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. స్వామి అమ్మవార్లకు పుష్పాలంకరణ, పుష్పార్చనలు చేశారు. అనంతరం ఊయలసేవ నిర్వహించారు. అలాగే శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాళమ్మవారికి అభిషేకం, విశేష పూజలను చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామి(కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 24 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, అబ్జర్వర్ హరి, లక్కసాగరం లక్ష్మీరెడ్డి, చిట్యాల మద్దయ్యగౌడు, కోట్రికే హరికిషన్, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పైపులకు మరమ్మతులు చేయాలి

ప్యాపిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి సంబంధించి దెబ్బతిన్న పైపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని ఏనుగమర్రి, వెంగళాంపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పైపులైన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కోట్ల గ్రామాల రైతులతో పైపులైన్ ఎలా దెబ్బతినిందో అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న పైపులైన్ నిర్మాణానికి మరమ్మతులు చేపట్టి చెరువులకు నీటిని సరఫరా చేయాలన్నారు. టీడీపీ నాయకులు వై లక్ష్మీనారాయణయాదవ్, జయ సీలమ్మ, టి.శ్రీనివాసులు, ఖాజాపీర్, కోదండరామయ్య, రాంబాబు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

బేతంచెర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

చెక్కును పంపిణీ చేసిన కోట్ల సుజాతమ్మ: బేతంచెర్ల మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లస్వామి మృతిపై మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం మృతుని కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయంగా రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎల్ల నాగయ్య, బుగ్గన ప్రసన్నలక్ష్మీ, పోలూరు రాఘవరెడ్డి, తిరుమలేష్ చౌదరి, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్, సుధాకర్, మేకల నాగరాజు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేద్దాం : సుబ్బారెడ్డి



డోన్ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనను జయప్రదం చేద్దామని రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఎంఎస్ఆర్ కార్యాల యంలో మా ట్లాడుతూ ఈనెల 16న ప్రధాని నరేంద్ర మోదీ ఉమ్మడి జిల్లా పర్యటన ఉంటుందని.. అలాగే జరిగే బహిరంగ సభకు ఉమ్మడి జిల్లాల కూటమి నాయకులు, కార్యకర్తలు, భారీగా హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

14, 15 తేదీల్లో నిరసన

బేతంచెర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ ఈ నెల 14, 15 తేదీల్లో వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసనను జయప్రదం చేయాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు కోరారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జీఎస్టీ పేరుతో సామాన్యుడిని నడ్డి విరిచి లక్షల కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. మరో వైపు జీఎస్టీ భారం తగ్గించి ప్రతి ఇంటికి రూ.15వేలు మేలు చేశామని అసత్య ప్రచారాన్ని నిర్వహించడం ఏమిటనీ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, ఉదయ్, పుల్లయ్య, బాలు, ప్రదీప్ ఖాదీర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని యు.కొత్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, పరిశ్రమలకు శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డిప్యూటీ ఏఈ నాగేంద్ర, రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని టౌన్-1 ఫీడర్ కింద మరమ్మతుల కారణంగా లక్ష్మీఫంక్షన్ హాలు, మహాలక్ష్మి హాస్పిటల్, కురుకుందు కాలనీ, పండరినగర్, పాతపేట, కొండపేట ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజాము 5 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఇస్తామన్నారు.

రుద్రవరం: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఏఈ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని రుద్రవరం, యల్లావత్తుల, చిన్నకంబలూరు, ఆలమూరు, చిత్రేణిపల్లె, హరినగరం పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

కంటి వైద్య శిబిరం

కోవెలకుంట్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచ్ జీసీ ఆర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో నంద్యాల పట్టణానికి చెందిన శాంతి రాం ఆసుపత్రి వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు.

చాగలమర్రిలో భారీ వర్షం

- పొంగి ప్రవహించిన అడ్డవాగు
- నీట మునిగిన పొలాలు

చాగలమర్రి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. 12.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. గోపాయపల్లె రహ దారిలోని అడ్డవాగు పొంగి ప్రవహించింది. సమీపంలోని పంట పొలాల్లో సాగు చేసిన కంది, మినుము, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. రెండు రోజులు తిరగక ముందే మళ్లీ వర్షం కురవడంతో రహదారులపై ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం తడిచిపోయింది. చింతలచెరువు, చిన్న వంగలి గ్రామాల సమీపంలో ఉల్లి పంట కోత కోసి పంట పొలాల్లో ఆరబెట్టుకున్న ఉల్లిగడ్డలు తడవడంతో రైతులు ఆవేదన చెందారు. నేలంపాడు, గొట్లూరు గ్రామాల సమీపంలో వరద నీరు తగ్గక ముందే మళ్లీ వర్షం కురవడంతో పంట పొలాలు వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి. 1,100 ఎకరాల్లో మొక్కజొన్న, 200 ఎకరాల్లో మినుము, 100 ఎకరాల్లో జూట్, 50 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నాయి.



గోపాయలపల్లె రహదారిలో పొంగి ప్రవహిస్తున్న అడ్డవాగు



బి.నాగిరెడ్డిపల్లెలో తడిచిన మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతులు



ముత్యాలపాడులో నీట మునిగిన మినుము పంట

రుద్రవరం: మండలంలో శుక్రవారం వర్షం కురిసింది. మొక్కజొన్నలు తడిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బి.నాగిరెడ్డిపల్లె మెట్ట, చిన్నకంబలూరు, నరసాపురం, ముత్తలూరు, నల్లవాగుపల్లె, హరినగరం సమీపంలో రహదారులపై ఆరబోసిన మొక్కజొన్నలు వర్షానికి తడిచాయని రైతులు వాపోయారు.

సంజామల: ఎడతెరపి లేని కురుస్తున్న వర్షాలు రైతులపాలిట శాపంగా మారాయి. పంటకోత కోసేందుకు ఆలస్యమైన నాలుగు రోజులు వర్షాలు కురవకపోవడంతో రైతులు పంట కోత కోయించి ఆర బెట్టారు. ఈ తరుణంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 35.5మిల్లీ మీటర్ల వర్షపాతంగా నమోదైంది. వర్షానికి తడవ కుండా మొక్కజొన్నపై పట్టలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. చేతి కొచ్చిన పంట దక్కకుండా పోతుందా అని రైతులు బెంబేలెత్తుతున్నారు.

23న బనగానపల్లెలో జాబ్ మేళా



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకురాలు బీసీఇందిరమ్మ శుక్రవారం తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసంద ర్భంగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ మేళాకు పది ప్రవేటు కంపెనీలు హాజరు కానున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ చేసిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోవెలకుంట్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 6న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం కోవెలకుంట్ల కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఓబులేసు, ఉపాధ్యక్షుడు శేఖర్, సభ్యులు రమేశ్, సుధాకర్, సీనియర్ న్యాయవాదులు క్రిష్ణమూర్తి, మధుసూద నరెడ్డి, బాలమురళి, మల్లిఖార్జున రెడ్డి, లక్ష్మీనరసింహుడు, ఖాసింసాహెబ్ తిరుపాలు, చంద్రుడు, కంబగిరి, శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు ప్రజాసంఘాల ఐద్య వేదిక ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన రాకేశ్‌కిశోర్‌ను శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సుధాకర్, కరీంబాషా, వెంకటయ్య, సుబ్బరాయుడు, బండెల ఓబులేసు, కత్తి ఓబులేసు, రామసుబ్బ య్య, దేవరాజ్, శేఖర్, నరసింహ, రాముడు, బుజ్జి పాల్గొన్నారు.

స్టేట్ బార్‌కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తా

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రవి గువేరా



న్యాయవాదులతో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రవి గువేరా

ఆళ్లగడ్డ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మరల పోటీ చేస్తామని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు రవి గువేరా అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్‌లోని పలువురు న్యాయవాదులను ఆయన కలుసుకున్నారు. రవి గువేరా మాట్లాడుతూ గతంలో ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ సభ్యులు తమకు మద్దతు తెలిపి తన విజయానికి కృషి చేశారన్నారు. మళ్లీ ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ సభ్యుల మద్దతు కోసం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నాయుడు, నీలకంఠేశ్వరం, రమణయ్య, సుబ్బారెడ్డి, విజయ్, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, శ్రీనివాసులు, లక్ష్మీనరహరి, పాములేటి, నరేంద్ర, అంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

చాగలమర్రి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు బసవరాజుపై దాడి చేయడం అమానుషమని పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవింద్రారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మౌలాలి, ఆంజనేయరెడ్డి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మద్దూరు పాఠశాల వద్ద నిరసన ప్రకటించారు. దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సురేష్, మాబు షరిఫ్, హరినాథ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డోన్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డోన్ రూరల్ సీఐ రాకేష్‌బాబు, రూరల్ ఎస్ఐ మమత అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని సీసంగుంతల గ్రా మంలో ప్రొజెక్టర్ ద్వారా వీడియోలు వేసి సైబర్ నేరాలపైన రూరల్ పోలీసులు అవగాహన కల్పించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలపై అవగాహన ఇచ్చారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

శెట్టివీడు సర్పంచ్ రాజీనామా

చాగలమర్రి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి తన పదవికి రాజీమానా చేశారు. శుక్రవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్‌కు ఆమె రాజీనామా పత్రాన్ని అందజేశారు.

వైభవంగా పవిత్రోత్సవం

చాగలమర్రి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు శుక్రవారం మహిళలు సామూహిక పవిత్రోత్సవం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, వాసవీమాత పారాయణం చేశారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడవద్దు : సీఐ

కోవెలకుంట్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్‌పెక్టరు హనుమంతనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీవాసవి బొమ్మిడాల డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ముఖ్యఅతిథులుగా కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ మల్లికార్జున హాజరయ్యారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే సైబర్ నేరాల ఉచ్చులో పడితే టోల్‌ఫ్రీ నెం.1930కి ఫోను చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేంద్రనాథరెడ్డి, రమణారెడ్డి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్యాయం చేయడం తగదు

కొలిమిగుండ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం అన్యాయం చేయడం తగదని దివ్యాంగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా దివ్యాంగులు పాత సదరన్ సర్టిఫికెట్ల ఆధారంగానే పింఛన్ పంపిణీ చేపట్టాలంటూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో ప్రసాదరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, వెంటకరమణారెడ్డి, దస్తగిరి, కృష్ణమోహన్, నాగేష్ పాల్గొన్నారు.

వేలంలో రూ.1.25 లక్షల ఆదాయం

కోవెలకుంట్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుందూనది పక్కనున్న పార్కు నిర్వహణ కోసం వేలం పాటలో గ్రామపంచాయతీకి రూ.1.25 లక్షలు ఆదాయం వచ్చినట్లు డిప్యూటీ ఎంపీడీవో, కోవెలకుంట్ల గ్రామ పంచాయతీ ఈవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు కోవెలకుంట్ల గ్రామ పంచాయతీ పార్కులో డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. షేక్ సాహెబ్‌బాషా అనే వ్యక్తి రూ.లక్ష 25వేలు వేలం పాట పాడి దక్కించుకున్నాడు.

పేదలకు వైద్యం అందడం లేదు: ఏఐవైఎఫ్

డోన్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు వైద్యం అందడంలేదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డోన్ నియోజకవర్గ పరిధిలో ప్రమాదాల బారిన పడి గాయాలతో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఇక్కడ డాక్టర్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని చీటీలు రాసి ఇవ్వడం దారుణమన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు కూడా కర్నూలుకు వెళ్లాలని చెబుతూ చీటీలు రాయడం బాధాకరమన్నారు. నాయకులు విజయ్, ఓబులాపురం హరి, నాగరాజు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు ఊరట

శిరివెళ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనేక రకాల వస్తువులు, సేవలపై జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు భారీ ఊరట లభించిందని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. జీఎస్టీ 2.0పై కళాశాలలో శుక్రవారం వివిధ రకాల కార్యక్రమాలు, అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ 2.0 అంశంపై విద్యార్థులచే పోస్టర్ ప్రదర్శనతోపాటు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్

కొలిమిగుండ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్ట్రాటెక్ పరిశ్రమలోని ఆదిత్యా బిర్లా పాఠశాలను శుక్రవారం కర్నూలు, అనంతపురం జిల్లాల ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠీ సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావే శం నిర్వహించి, పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో కర్నూల్ బాలికల బెటాలియన్ ముఖ్యఅధికారి కల్నల్ జోబీ పిలిప్, ప్రిన్సిపాల్ స్మితావేణు, ఎన్‌సీసీ ఏఎన్‌వో రాణి పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాత పల్లకీ ఉత్సవం



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరంలో చౌడేశ్వరీమాత పల్లకీసేవ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పల్లకీసేవలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత

సంజామల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత తల్లిదండ్రులను కోరారు. శుక్రవారం సంజామల సచివాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. శాంత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. డ్రాపౌట్స్ పిల్లలు, బడికి పంపించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది హరిత, రవితేజారెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు సువర్ణ, సుజాత పాల్గొన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాలు అందిస్తాం: ఏవో

కొలిమిగుండ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శనగ సాగుచేసే రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు అందిస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని మండల వ్యవసాయ అధికారి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో సబ్సిడీ శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. కొలిమిగుండ్ల రైతు సేవా కేంద్రానికి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు.

రైల్వే ఎలక్ట్రికల్ లైన్ ప్రారంభం

కొలిమిగుండ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు నూతనంగా నిర్మించిన రైల్వే ఎలక్ట్రికల్ లైన్‌ను శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు ప్రారంభించారు. సంజామల రైల్వే లైన్ నుంచి కానాల, మంగపల్లి, రామిరెడ్డిపల్లె మీదుగా రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వరకు నూతన రైల్వే లైన్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఈ టీఆర్డీ వీరభద్రయ్య, రామ్‌కో యూనిట్ హెడ్ మీనాక్షీ సుందరం, అడ్మిన్ హెడ్ రామరాజు పాల్గొన్నారు.

పశువుల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పశువుల వ్యాధులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి పశుసంవర్ధకశాఖ ఏడీ ప్రతాప్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

క్రీడా పోటీలను ప్రారంభించిన సీఐ



కొలిమిగుండ్లలో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు



శిరివెళ్లలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో, టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు, ఎంపీడీవో ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో అబ్దుల్‌కలాం ఆధ్వర్యంలో మం డల స్థాయి స్కూల్ గేమ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 155 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్-17, 14 విభాగాల్లో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల క్రీడల కో- ఆర్డినేటర్ నాగరాణి, ఉపాధ్యాయులు రమణయ్య, వైవీఎస్ నారాయణరెడ్డి, హెచ్ఎం కొండప్ప పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో శోభావివేకవతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో హెచ్ఎం వీరరాఘవయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఈటి రాణి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని నరసాపురం జడ్పీఎస్ హైస్కూలులో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఎంఈవో వీరరాఘవయ్య, ఎంఈవో-2 లక్ష్మి ప్రారం భించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, హెచ్ఎం వెంకటరమణ, రాజ్యలక్ష్మి, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటరు ధర్మరాజు, పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: స్థానిక ఉన్నత పాఠశా లలో జరిగిన మండల స్థాయి క్రీడల్లో ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 14 విభాగంలో నిర్వహించిన కబడ్డీ పో టీల్లో ఉన్నత పాఠశాల ఉయ్యాలవాడ విద్యార్థులు ప్రతిభ కనబరచగా, బాలికల్లో హరివరం పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అండర్ 17లో ఆదర్శ పాఠశాల బాలికలు ప్రతిభ కనపరచగా, వాలీబాల్ పోటీల్లో ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అండర్ 14లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు షీల్డు, మెడల్స్ అందించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో ఉమామహేశ్వర రావు, ఎంఈవో1 రఘురామిరెడ్డి, ఎంఈవో2 ప్రతాప్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉయ్యాలవాడ, మాయలూరు ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, షరీఫ్, పీఈటీలు నరసింహుడు, ప్రతాప్, నాగేంద్ర, కళావతి పాల్గొన్నారు.

శిరివెళ్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో నాగార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు బీసీ ఫిదా హుసేన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రీడా పోటీలను వారు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు కబడ్డీ, షటిల్, వాలీబాల్ ఖోఖో తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో నెహ్రూ ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్కూల్‌గేమ్స్ ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ, జడ్పీ, ప్రైవేటు పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. ఎంఈవో శ్రీనివాసులు, స్కూల్ కరస్పాండెంట్ కమల్‌తేజారెడ్డి, రవితేజారెడ్డి పోటీలను ప్రారంభించారు.